# మతిమరపు

శ్రీకాకుళపు రామకృష్ణ

రోహిణీకార్తె రంగప్రవేశంతో సూర్యభగవానుడు మరింత విజృంభిస్తూ తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాడు. సముద్రానికి దగ్గరైననూ బందర్లో కూడా ఎండ అధికంగానే వుంది. బస్‌స్టాండ్ కోలాహలంగా వుంది.

పావు గంట నుండి విజయవాడ బస్సుకోసం ఎదురు చూస్తున్నారు పరంధామయ్యగారు. చుట్టూ రకరకాల మనుషులు. హైదరాబాద్‌వాళ్ళు కాబోలు కిళ్ళీలు నమిలి గోడలమీద వూస్తున్నారు. ప్రక్కనే స్పిట్యూన్ వున్నను. కంపరమెత్తింది పరంధామయ్యగారికి.

అక్కడ్నుంచి కదిలి పుస్తకాల షాపు వైపుకి వెళ్ళి పుస్తకాలుచూస్తూ నిల్చున్నారు. ఇంతలో విజయవాడ బస్ రానే వచ్చింది. బెల్లం చుట్టూ ఈగల్లా పడ్డారు జనం బస్సుమీద. దిగేవాళ్ళని దిగనివ్వకుండా తోసుకుంటూ ఎక్కుతున్నారు సాహసవీరులు. అంతమందిని ఛేదించుకుని బస్‌లోకి ఎలా వెళ్లాలా అని ఆలోచిస్తూ చూస్తున్నారు పరంధామయ్యగారు. ఇంతలో బస్‌లోంచి 'మాస్టారూ', అన్న పిలుపు విన్పించింది. పరంధామయ్యగారి శిష్యుడు శంకరం కనబడ్డాడు.

విజయవాడ నుండి వస్తున్నాడు కాబోలు. బస్ విండోలో నుండి బాగ్ తీసుకొని ఒక సీటులో పెట్టాడు శంకరం. పరంధామయ్యగారికి బస్‌లో సీటు రిజర్వ్ అయిపోయింది. శంకరం బస్ దిగివచ్చి పరంధామయ్యగారితో చెప్పి వెళ్ళిపొయాడు. రష్ తగ్గాక తన సీటులోకి వెళ్ళి కూర్చున్నారు పరంధామయ్యగారు. ప్రక్కనే విండో సీటీలో ఎవరో కుర్రాడు ఏదో సినిమా పత్రిక కాబోలు చదువుతూ కూర్చున్నాడు.

పరంధామయ్యగారు ఎలిమెంటరీ స్కూలు హెడ్‌మాస్టరుగా పనిచేసి నాలుగేళ్ల క్రితం రిటైర్డ్ అయ్యారు. ముగ్గురు కూతుళ్ళు, ఒక కొడుకు. తన సంపాదనలో ఇద్దరి కూతుళ్ళని అత్తవారిళ్లకు పంపాడు. మూడో కూతురు తనూజ పెళ్ళిచేయడానికి తగిన ఆర్థిక వసతిలేదు. కొద్దో, గొప్పో వున్న, అది పెళ్ళి ఖర్చులకి సరిపోతుంది కాని, కట్నం ఇవ్వడానికి సరిపోదు. కొడుకు శివప్రసాద్ బ్యాంక్‌లు ఉద్యోగం చేస్తూ, తనతో పాటే పనిచేస్తున్న కామేశ్వరిని పెళ్ళి చేసుకుని దూరంగా వెళ్ళిపోయాడు. ఇప్పుడు కొడుకు కూడా తన చెల్లెలి పెళ్ళి విషయం పట్టించుకోడు. తనూజ పెళ్ళి ఎలా చెయ్యాలా అన్న సమస్యతో వున్న పరంధామయ్యగారికి కంకిపాడు నుండి చిన్ననాటి మిత్రుడు రంగారావు రాసిన వుత్తరం కొంత రిలీఫ్ నిచ్చింది. ఆయన దగ్గరకే బయల్దేరారు పరంధామయ్యగారు.

బస్ బయల్దేరడంతో కిటికీలో నుండి గాలి వస్తుంది. జేబులో నుండి రంగారావు వ్రాసిన వుత్తరం తీసి చదువుకున్నాడు పరంధామయ్యగారు

ప్రియ పరంధామం,

ఉభయ కుశలోపరి, ఈ మధ్య మన మధ్య రాకపోకలు లేకపోగా, కనీసం ఉత్తరాల రాకపోకలు కూడా సాగట్లేదు. వయసు మీద పడుతున్నా వయసులోని జ్ఞాపకాలు వూరట కలిగిస్తున్నాయి. చిరంజీవి శివప్రసాదు వెళ్ళిపోయాడటగా? మనమేం చేయగలంరా, పిల్లల్ని కనగలం కాని, వాళ్ల రాతలెక్కడ కనగలం? రెక్కలొచ్చేవరకేరా పక్షి గూటిలో వుండేది రెక్కలొచ్చేక తన దారి తను చూసుకుంటుంది. అది పక్షుల్లోనే కాదురా మనుషుల్లోను అంతే అని మన శివప్రసాదులాంటి వాళ్ళు రుజువు చేస్తున్నారు. అంతే.

సరే ఆ విషయాలు వదిలేయ్, మా దూరపు బంధువుల కుర్రాడు ప్రసాద్ అని ఆర్టీసిలో కండక్టరుగా పన్చేస్తున్నాడు. ఈ మధ్య అతను ఏదో పెళ్ళిలో మన అమ్మాయి తనూజను చూశాడట. అమ్మాయి అతనికి నచ్చిందట. ఈ విషయం నీతో ప్రస్తావించమని అతను నా దగ్గరకొచ్చి అడిగాడు. అతను కట్న కానుకలేవి ఆశించడంలేదు. కుర్రాడు బుద్ధిమంతుడు, పైగా గవర్నమెంటు వుద్యోగం. ఆలోచించు. మననుండి అతనుగాని, అతని తరపువారుగాని పైసా కూడా ఆశించట్లేదు. పిల్ల బాగుంది చాలు అంటున్నారు. మరి రెండు, మూడు రోజుల్లో నువ్వు ఇక్కడికి వస్తే, కుర్రాడిని చూద్దాం. నీకు నచ్చితే శుభస్య శీఘ్రం. శీఘ్రమే కళ్యాణ ప్రాప్తిరస్తు (నీక్కాదురోయ్) అమ్మాయికి. వుంటామరి.

నీ రంగారావు.

"టికెట్ సార్, టికెట్, టికెట్ .." కండక్టర్ టిక్కెట్లు అడుగుతూ అభిమన్యుడిలా జనాల్ని తప్పించుకుని వస్తున్నాడు. పరంధామయ్యగారి దగ్గరకు వచ్చాడు. చదువుతున్న వుత్తరం జేబులో పెట్టుకుని ఇరవై రూపాయల నోటు తీసి కండక్టర్‌కిచ్చాడు కంకిపాడు ఒక టిక్కెట్టు ఇవ్వమంటూ.

"చిల్లర లేదా సార్?"

లేదన్నట్టుగా తలవూపారు పరంధామయ్యగారు.

"సరే, టిక్కెట్టు వెనుక మీకు రావల్సిన పధ్నాలుగు రూపాయలు రాస్తున్నా, దిగేటప్పుడు తీసుకోండి. చిల్లర పెద్ద ప్రాబ్లం అయిపోయింది సార్" అని టిక్కెట్టు చేతిలో పెట్టి ముందుకు వెళ్ళిపోయాడు కండక్టర్.

టిక్కెట్టు ఓసారి చూసుకుని జేబులో పెట్టుకున్నారు పరంధామయ్యగారు.

"రంగారావు మాటమీద కొండంత ఆశతో వెళ్తున్నాడు తను. రంగారావు పుణ్యమా అని తనూజ పెళ్ళి కుదిర్తే తన భారం వదలిపోతుంది. సామాన్యంగా ఏ తండ్రికిపిల్లలు భారం కారు. కాని ఆర్థికంగా వెనుకబడి వున్నప్పుడు మాత్రం ఎదిగిన ఆడపిల్లల పెళ్ళిళ్ళు తండ్రులకు భారంగానే వుంటాయి. ఎదిగొచ్చిన కొడుకు అండగా వుంటాడనుకుంటే వాడు తన దారి తను చూసుకున్నాడు. రంగారావు చెప్పింది నిజం. పక్షులు రెక్కలొచ్చే వరకేగూటిలో వుండేది.

ఇలా ఏవో ఆలోచనల్లో వుండగా కంకిపాడు వచ్చింది. గబగబా బ్యాగ్ పుచ్చుకుని దిగేశారు పరంధామయ్యగారు. దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది బస్. ప్రక్కనే వున్న కిళ్ళీ షాపులో సోడా తాగుదామని జేబులో చెయ్యి పెడితే రెండు రూపాయల కాగితం వచ్చింది. మిగిలిన వాటి కోసం వెదకగా టిక్కెట్టు చేతికొచ్చింది. అప్పుడు గుర్తొచ్చింది కండక్టరు నుంచి పధ్నాలుగు రూపాయలు రావల్సి వుందని. తను అడగకుండా పరధ్యానంగా దిగేశాడు. తన మతిమరుపుకు తిట్టుకుంటూ రెండు కాగితం యిచ్చి సోడా త్రాగారు. బస్ టికెట్‌ను జాగ్రత్తగా జేబులో పెట్టుకుని పది నిమిషాల్లో రంగారావు యింటికి చేరుకున్నారు.

బస్ కంకిపాడు దాటుతుండగా చెకింగ్ స్క్వాడ్ బస్ ఆపు చేసింది. కండక్టర్ అప్పుడేయస్నార్ పూర్తిచేశాడు. ఒక ఆఫీసర్ టిక్కెట్స్ లెక్కేసి, బ్యాగ్‌లో కాష్ కూడా లెక్కేశాడు. ఇరవై రెండు రూపాయలు ఎక్కువ వున్నాయి.

"ఏమిటి, కాష్ ఎక్కువగా వుంది?"

"అది పాసింజర్స్‌కివ్వాల్సింది సార్. చిల్లర్లేక దిగేటప్పుడు తీస్కుంటారు. వాళ్ల టిక్కెట్ల వెనుక కూడా రాశాను" వినయంగా చెప్పాడు కండక్టర్.

"ఐసి!" అని పాసింజర్ వైపు తిరిగి "ఎవరికైనా చిల్లర రావాలా?" అని అడిగాడు.

"నాకు రావాలండి. ఎనిమిది రూపాయలు. ఇదిగో టికెట్ వెనుక రాశాడు. విజయవాడలో దిగుతాను నేను" అని ఒకతను చెప్పాడు.

"ఇంకా ఎవరికైనా రావాలా?" మళ్ళీ అడిగాడు ఆఫీసర్.

ఎవ్వరూ మాట్లాడలేదు. కొద్దిసేపు చూసి.



"మరి ఈ పధ్నాలుగు రూపాయల మాటేమిటి? టిక్కెట్టివ్వకుండా జేబులో వేసుకుంటున్నావా?" తీవ్ర స్వరంతో అడిగారు.

పధ్నాలుగు రూపాయలు ఎవరికివ్వాలబ్బా అని పాసింజర్స్ వైపు చూశాడు .కండక్టర్. అప్పుడు గుర్తొచ్చింది. బందర్లో ఎక్కిన పెద్దాయనకి ఇవ్వాలని. ఆయన కోసం ఆశగా బస్‌లో చూశాడు. కాని, ఆయన లేడు. కంకిపాడు దిగిపోయాడు. ఈ విషయమే చెప్పాడు వాళ్లకి. కాని వాళ్ళు నమ్మలేదు.

"యువార్ సస్పెండెడ్ ఫ్రంది సర్వీసెస్. డిపోకెళ్లాకసస్పెన్షన్ ఆర్డర్ తీసుకో" అని బస్సు వెనకే జీపులో ఫాలో అయ్యారు చెక్కింగ్‌స్క్వాడ్‌మెంబర్స్.

బస్సు విజయవాడ వైపు వెళ్తుంది. కండక్టర్ ఎంత చెప్పినా ప్రయోజనం లేకపోయింది. పాసింజర్స్ సానుభూతిగా కండక్టర్ వంక చూస్తున్నారు.

"ఒరేయ్, పరంధామం క్లాసులో మనిద్దరం చేసిన అల్లరి ఎవరైనా చెయ్యగలరా? అడిగారు రంగారావు చిన్ననాటి విషయాలు మననం చేసుకుంటూ. ఇంతలో టీ తీసుకువచ్చింది అన్నపూర్ణమ్మగారు. రంగారావుగారి భార్య. టీ త్రాగుతూ చిన్ననాటి విషయాలు ముచ్చటించుకుంటున్నారిద్దరూ-

"ఐదు గంటలకి వెళ్దామోయ్, పెళ్లికొడుకుని చూడటానికి" చెప్పాడు రంగారావు.

"అలాగేలేరా, నీ యిష్టం" జవాబిచ్చారు పరంధామయ్యగారు.

సాయంత్రం ఐదు గంటలయింది. ఎండ తీవ్రత చాలా వరకు తగ్గిపోయింది. చల్లటి గాలి కొద్ది కొద్దిగా వీస్తుంది. ఇద్దరూ బయల్దేరుతున్నారు పెళ్లికొడుకుని చూడడానికి. ఇంతలో రంగారావుగారు భార్యను "ఏమేవ్ గృహలక్ష్మి కాస్త ఎదురురా. మీ అన్నయ్య కూతురికి సంబంధం కోసం వెళ్తున్నాం" అని కేకేశారు.

"అదేవిటి, అమ్మాయి పేరు అన్నపూర్ణ కదూ?" సందేహం వెలిబుచ్చారు.

"అదంతేలేరా. ఈ యింటికి ఆవిడే కదా గృహలక్ష్మి".

"ఓరి భడవా" నవ్వుకున్నారు పరంధామయ్య.

అన్నపూర్ణమ్మగారు ఎదురు వచ్చింది. వాళ్లిద్దరూ బయల్దేరి పెళ్లికొడుకు ప్రసాదు యింటికి చేరుకున్నారు.

ప్రసాదు తల్లి సాదరంగా ఆహ్వానించింది ఇద్దర్నీ. రంగారావు పరంధామయ్యగార్ని పరిచయం చేశారు. "ప్రసాదు ఇంకా రాలేదేమ్మా?" అడిగారు రంగారావుగారు.

"విజయవాడలో డ్యూటీ దిగి రావాలి కదండీ. కొంచెం ఆలస్యమవుతుంది. అయినా ఈసరికే రావల్సినవాడు" చెప్పింది ప్రసాదు తల్లి.

కొడుకు గుణగణాలు చెప్తుంది ఆవిడ. ఓ అరగంట కూర్చున్నారు ప్రసాదు కోసం. లోకాభిరామాయణం మాట్లాడుతుండగా ఎవరో కుర్రాడు వచ్చి "పిన్నీ, మన ప్రసాదుని ఉద్యోగంలోంచి తీశేసారట. బాగ్‌లో డబ్బులు, పధ్నాలుగు రూపాయలు ఎక్కువ వున్నాయట" అని చెప్పాడు.

దిగాలుగా కూర్చుంది ప్రసాదు తల్లి.

"నా బిడ్డ అటువంటివాడు కాదు రంగారావుగారూ. ఎందుకు జరిగిందో యిది. కొంచెం వెళ్లి కనుక్కోండి" అంటూ రంగారావుని బ్రతిమాలింది ఆవిడ.

అప్పుడు గుర్తొచ్చింది పరంధామయ్యగారికి -తను మర్చిపోయింది కూడా పధ్నాలుగు రూపాయలేనని. ఒకవేళ అతనేనేమో!

"ఏమ్మా, అబ్బాయి ఈ రోజు డ్యూటీకి ఏ వూరు వెళ్లాడు?" అడిగారు పరంధామయ్యగారు.

"బందరండి" చెప్పిందావిడ.

"రైట్, తను ఇందాక మర్చిపోయి దిగింది ప్రసాద్ బస్‌లో నుంచన్నమాట.

"పదరా రంగా, ఈ ఉద్యోగం ఎక్కడికీ పోదు. ఆ పధ్నాల్గు నేనే మరిచిపోయి వచ్చా. టిక్కెట్టు కూడా భద్రంగా వుంది. వెనుక అతను రాశాడు కూడా". చెప్పాడు. ఇద్దరు బస్‌స్టాండుకి బయల్దేరారు.

మరో గంటలో విజయవాడ బస్ డిపో మానేజర్ ధగ్గరున్నారు రంగారావు, పరంధామయ్యగారు. జరిగినదంతా చెప్పి టిక్కెట్టు చూపించారు పరంధామయ్యగారు. సరే, ఓ గంటలో సస్పెన్షన్ అర్డర్స్ కాన్సిల్ చేస్తాం. మిగిలిన ఆఫీసర్స్‌తో కూడా మాట్లాడాలి." చెప్పాడు డిపో మానేజర్.

ప్రసాద్ కోసం వెదుకుతున్నారిద్దరూ. ప్రసాద్ తనకు తెల్సిన ఆఫీసర్ల చుట్టూ తిరుగుతున్నాడు.

ఒక గంటలో సస్పెన్షన్ అర్డర్స్ విత్‌డ్రా చేసుకున్నారు ఆఫీసర్లు. ప్రసాదుకి డిపో మానేజర్ జరిగింది చెప్పాడు. తన వుద్యోగాన్ని నిలబెట్టిందెవరా అని బయటకు వచ్చి చూశాడు. బయట రంగారావుగారు, ప్రక్కన ఇంకొకాయన కనపడ్డారు. రంగారావు ప్రక్కనున్నది బందర్లో ఎక్కి కంకిపాడులో చిల్లర మర్చిపోయి దిగేసిన పెద్దాయన. గుర్తొచ్చింది ప్రసాద్‌కి. ప్రసాదు వచ్చి రంగారావుగార్ని పలకరించాడు. రంగారావుగారు పరంధామయ్యగారిని పరిచయం చేశారు "మీ కాబోయే మామగారు నాయనా!" అంటూ. ముగ్గురూ, కాఫీ త్రాగారు బస్‌స్టాండులోని హొటల్లో. పరంధామయ్యగారు అక్కడే బందరు బస్సు ఎక్కారు.

నెల తిరగ్గానే పరంధామయ్యగారు పడకుర్చీలో కూర్చుని శుభలేఖల మీద అడ్రస్‌లు వ్రాస్తున్నారు బంధుమిత్ర సపరివారులందరికీ. □

